సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 3-2-2025

సంపుటి: 20 సంచిక: 264

పేజీలు: 8 వెల: రూ.1



## గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

**- అధ్యక్షులుగా గాంధీ, కార్యదర్శిగా అనంత కృష్ణ**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం గోల్డ్‌షాప్స్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాయుడు జ్యూయలరీ అధినేత లంకగాంధీ, కార్యదర్శిగా సత్య జ్యూయలరీ అధినేత ఊణ్ణ అనంతకృష్ణను ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక అసోసియేషన్ భవనంలో నిర్వహించిన గోల్డ్ షాపు మర్చంట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోల్డ్‌షాప్ మర్చంట్స్ అందరికీ భాగస్వామ్యం కల్పించాలన్న ఉద్దేశంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. అసోసియేషన్ కోశాధికారిగా బ్రహ్మాజీ జ్యూయలరీ యజమాని సూరంపల్లి బ్రహ్మాజీ, ఉపాధ్యక్షులుగా కామేశ్వరి క్రాంతి యజమాని పేర్ల శ్రీకాంత్ పేరును ప్రకటించారు. వీరితోపాటు కార్యవర్గంలో మరికొందరకి ప్రాతినిధ్యం ఇచ్చేందుకు నిర్ణయించారు. వీరి వివరాలను తర్వాత సమావేశంలో ప్రకటించనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, ఉపాధ్యక్షులకు నగరంలో బంగారు వర్తకులు పాండ్రంకి రమేష్‌నాయుడు, వీనస్ హరి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.









# రాజ్యమా.. ఉలికిపడు!















- ఇప్పటివరకు సూపర్‌హిట్.. ఈ రాత్రికే మొదలవుతుంది హీట్
- నగరమంతా సందడే సందడి
- అమాంతం పెరిగిపోయిన పాలకుల మైలేజీ
- పోలీసులు ఓవరాక్షన్ చేయకపోతే దర్శనాలు సులభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

"విమాన ప్రయాణం చాలాసార్లు చేశాను. తీర్థయాత్రలకు వెళ్లాలన్నా, విదేశాల్లో ఉన్న మా పిల్లల దగ్గరకు వెళ్లాలన్నా విమానం తప్ప మరో ఆప్షన్ లేదు. కానీ హెలికాప్టర్ ఎక్కడమనేది అందరికీ కుదిరే వ్యవహారం కాదు. కానీ రథసప్తమి ఉత్సవాల పుణ్యమాని హెలికాప్టర్‌లో నేనున్న ఊరిని చూసుకోగలిగాను. ఈరోజుల్లో రూ.1800కు ఏమొస్తుందండీ?! ఏర్పాట్లు అదిరిపోయాయి."

- బలగ కమల, కాకివీధి


"70 ఏళ్లుగా అరసవల్లిలోనే నివాసముంటున్నాను. నా కళ్లతో ఎన్నో రథసప్తములు చూశాను. చిన్నప్పుడు రేగుపళ్లతో మా అమ్మ సూర్యభగవానుడికి నైవేద్యం ఇచ్చిన దగ్గర్నుంచి నాకు రథసప్తమి తెలుసు. కానీ ఇంత పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో ఊరంతా సంబరాలు చేసుకోవడం నేనెప్పుడూ చూడలేదు."

- అశ్వద్ధామ, అరసవల్లి

- మిగతా చివరి పేజీలో









## ఎంపీ కలిశెట్టిని అభినందించిన సీఎం బాబు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు ఉన్న సామాజిక స్పృహ, పార్టీపై గల విధేయతను ప్రశంసిస్తు సీఎం చంద్రబాబు అభినందించారు. ఆదివారం ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వెళ్లిన చంద్రబాబు శుక్రవారం ఏర్పాటుచేసిన పత్రికా సమావేశం అనంతరం సైకిల్‌పై సీఎం క్యాంపు కార్యాలయానికి హాజరైన ఎంపీ కలిశెట్టిని అభినందించారు. సైకిల్‌పై కలిశెట్టి రావడాన్ని గుర్తించిన చంద్రబాబు ఆయన సహాయకులద్వారా పిలిపించి ముచ్చటించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ అప్పలనాయుడు అందరికీ ఆదర్శవంతంగా ఉంటూ రాష్ట్రానికి, పార్టీకి మంచి పేరు తీసుకొస్తున్నారని కొనియాడారు. అనంతరం అప్పలనాయుడు మాట్లాడుతూ ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యక్తిగత సామాజిక బాధ్యతతో దివంగత ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ అధికారిక సింబల్ సైకిల్‌ను ఎంపిక చేసుకున్నట్టు తెలిపారు. అందులో భాగంగా సీఎం చంద్రబాబు ఢిల్లీలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో పాల్గొనటానికి ఎంపీ కలిశెట్టి సైకిల్‌పై సీఎం క్యాంప్ ఆఫీస్‌కి చేరుకున్నారు.






















• ఎడిటోరియల్

## మధ్యతరగతి జీవులను ఆకర్షించిన బడ్జెట్

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పైపైన చూస్తే పాక్షికంగానైనా మధ్యతరగతి జీవులను ఆకర్షించేదిగా కనిపిస్తుంది. ఈ బడ్జెట్‌లో 12 లక్షల వరకు ఆదాయపన్ను ఉండదు అన్న ప్రతిపాదన బాగా హైలట్ అయ్యింది. అయితే, అటు ఆర్థికమంత్రి ఇటు వేతన జీవులు తరచూ దృష్టి సారించని మరో కీలకాంశం ఉంది. అదే ద్రవ్యోల్బణం. గత మూడు సంవత్సరాలుగా ద్రవ్యోల్బణం అదుపు తప్పే ఉంది. ఈ కాలంలో ప్రత్యేకించి, గత ఐదు ఆరేళ్లలో నిత్య అవసర వస్తువుల ధరలు రెండు, మూడు రెట్లు పెరిగాయి. ఇది ప్రతి కుటుంబానికి అనుభవంలో ఉన్న విషయమే. అదే సందర్భంలో స్వాతంత్ర్యానంతరం నిజవేతనాలు దశాబ్దానికి పైగా స్తబ్దతకు లోనవడం ఇదే మొదటిసారి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, స్తబ్దతకు లోనైన వేతనాలు నేపథ్యంలో ఆదాయ పన్ను రాయితీ వల్ల కలిగే నిజమైన ప్రయోజనం, ఊరట నామమాత్రమే. వీళ్ల డబ్బులకు విలువ ఉండాలంటే ద్రవ్యోల్బణంలో ధరలు పెరగకూడదు, రూపాయి విలువ పడిపోకూడదు. మరో పక్క అంతర్జాతీయ మార్కెట్‌లో జరుగుతున్న పరిణామాలను చూస్తే రూపాయి విలువ పతనం శాశ్వత ధోరణిగా కనిపిస్తోంది. రూపాయి విలువ పడిపోతే విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల ఖరీదు పెరుగుతుంది. అది కూడా ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచుతుంది. అంతిమంగా సార్వత్రిక ద్రవ్యోల్బణం పెరుగుదుల, వినియోగదారుల కొనుగోలు శక్తి క్షీణతగా ఆర్థిక వ్యవస్థలో స్థిరీకరణించబడుతోంది. ఈ సాంకేతికత పక్కన పెడితే పెరిగే ధరల భారం కారణంగా ప్రజల చేతుల్లో మిగులు నిల్వలు కరిగిపోతాయి. తరిగిపోతాయి. దాంతో పెట్టుబడులు పెట్టి ఉత్పత్తి చేద్దామనుకుంటున్న కంపెనీల లాభాల రేటు కూడా పడిపోతుంది. లాభాల రేటు పడిపోయే సమయంలో అదనపు పెట్టుబడులు పెట్టి అదనపు ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకొల్పే ప్రయత్నాలు ముందుకు సాగవు. ఫలితంగా ఉత్పాదక సామర్థ్యం మందగిస్తుంది. అంతిమంగా ఈ పరిణామాలన్నీ సంక్షోభానికి దారితీస్తాయి. ఈ కోణంలో చూసినప్పుడు బడ్జెట్ ప్రతిపాదించిన ఆర్థిక వ్యూహం, ద్రవ్య వ్యూహం, పెట్టుబడుల వ్యూహం సంక్షోభాన్ని తీవ్రతరం చేసేదిగా ఉందే తప్ప దేశ ఆర్థిక వ్యవస్థను, ప్రజల వినియోగ శక్తిని గట్టెక్కించే పరిస్థితులు కనిపించటం లేదు. ఈ దిశగా ఈ బడ్జెట్ ఆశాజనక వాతావరణాన్ని కల్పించటంలో విఫలమైందని చెప్పవచ్చు. వేతనాలు, పనిగంటలపై కార్పొరేట్ వర్గం లేవనెత్తిన చర్చలో జోక్యం చేసుకుంటూ ఆర్థిక సర్వే కూడా సుదీర్ఘ పనిగంటలు కార్మికుల ఆరోగ్యానికి క్షేమకరం కాదని తేల్చేసింది. లాభాలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల వేతనాలు కూడా పెంచేందుకు కార్పొరేట్ వర్గం సిద్ధం కావాలని కూడా కేంద్ర ఆర్థిక శాఖ సలహాదారు అనంత నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. ఏతావాతా ప్రతిపక్షాలు లేవనెత్తిన విషయాలనే అయిష్టంగానైనా అంగీకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేతనాలు స్థంభించాయన్న వాస్తవం ఎట్టకేలకు ప్రభుత్వం అంగీకరిస్తోంది. వేతనాలు ద్రవ్యోల్బణం స్థాయిని మించి పెరిగినప్పుడే ప్రజల వద్ద కొనుగోలు శక్తి పెరుగుతుంది. అంతో ఇంతో పొదుపు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. కానీ ఈ రెండు లక్ష్యాలను సాధించేందుకు బడ్జెట్‌లో ఎటువంటి ప్రత్యామ్నాయ మార్గాలు, విధి విధానాలు రూపొందించలేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. వేతనాల విషయానికి వస్తే రెండు మూడు కోణాల్లో ఈ సమస్యను మనం అర్థం చేసుకోవాలి. ప్రభుత్వ రంగంలో పరిశ్రమల స్థాపన ఎప్పుడో ఆగిపోయింది. ఉన్న ఉద్యోగాల్లోనే రకరకాల పేర్లతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, టైం స్కేల్ ఉద్యోగుల సంఖ్య పెరిగింది. దాదాపు ప్రతి ప్రభుత్వరంగ సంస్థలోనూ, ప్రభుత్వ విభాగంలోనూ 80 శాతం వరకూ ఉద్యోగ భద్రత లేని పరిస్థితుల్లో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. పైగా వీళ్లందరినీ నేరుగా సదరు ప్రభుత్వరంగ సంస్థ నియమించుకోవడానికి బదులు మధ్యలో ఓ ఏజెంట్ ద్వారా నియామకాలు జరుగుతున్నాయి. కంపెలు ఇచ్చే జీతంలో ఓ భాగం ఈ ఏజెంట్ల పరం అవుతుంది. దాంతో అరకొర జీతాల్లో కూడా కార్మికుల చేతికి దక్కుతున్నది చాలా తక్కువ. ఈ వ్యవస్థను సంస్కరించకుండా ఏజెంట్ల వ్యవస్థను రద్దు చేయకుండా అసంఘటిత రంగం ద్వారా పని చేసే కార్మికులు ఆ కొద్దిపాటి వేతనాలైనా నేరుగా అందుకునేందుకు అవకాశాలు కనిపించటం లేదు. ప్రభుత్వం గత ముప్ఫై ఏళ్లల్లో ఎన్ని బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా ఈ కోణంపై దృష్టిసారించనే లేదు. వేతన సంఘాలు ప్రభుత్వ రంగంలో పని చేసే శాశ్వత ఉద్యోగులకు సంబంధించిన వేతన విధానాన్ని మాత్రమే నిర్ధారిస్తాయి. ప్రత్యేకించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలోనే కనీస వేతనాలు అమలు కావటం లేదు.




కంగ్రాట్స్ తల్లీ!..
నిన్న దక్షిణాఫ్రికాతో జరిగిన మహిళల అండర్ 19 టి20 వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత్‌ని విజేతగా నిలిపిన భద్రాచలం అమ్మాయి గొంగడి త్రిషకి, మిగతా టీం సభ్యులకు అభినందనలు. టోర్నమెంట్ మొదటి నుండి చివరివరకు అద్భుతంగా ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టిన త్రిష "ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్" అవార్డ్ గెలుచుకుంది.

–అరణ్యక్రిష్ణ

# తండ్రి కష్టాలను చూస్తూ.. పెరిగిన తనయ!

దిగువ మధ్య తరగతి కుటుంబం నుండి వచ్చిన 19 ఏళ్ల (15.12.2005) త్రిష జనవరి 28న జరిగిన అండర్ 19 వరల్డ్ కప్‌లో అద్భుతమైన సెంచరీ చేసి భారత్‌ని సెమీ ఫైనల్స్‌కి తీసుకెళ్లింది. త్రిష చేసిన సెంచరీ మహిళల అండర్ 19 టీ–20 ప్రపంచ కప్ చరిత్రలోనే మొట్టమొదటిది. లెగ్ స్పిన్ ఆల్‌రౌండర్ ఐన త్రిష ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు కూడా తీసింది. తన సెంచరీని కేవలం 53 బంతుల్లోనే బాదిపడేసింది. మొత్తం 59 బంతుల్లో 110 పరుగులు చేసింది ఈ తెలంగాణ బిడ్డ. జనవరి 31న జరిగిన సెమీఫైనల్స్‌లో భారత్ ఇంగ్లాండ్ పై ఘన విజయం సాధించి ఫైనల్స్‌కి చేరింది. ఈ మ్యాచ్‌లో కూడా త్రిష తన బాట్‌తో మంచి ప్రదర్శన చేసింది. ఇంక ఇవాళ జరిగిన ఫైనల్స్‌లో బాట్‌తో 44 రన్స్, బాల్‌తో 3/15 ఆల్ రౌండ్ ప్రదర్శనతో చరిత్ర సృష్టించింది. అంతకు మునుపు ఆసియా కప్ మ్యాచెస్‌లోనూ, 2023 సీనియర్స్ ప్రపంచకప్ టోర్నమెంట్ లోనూ ఎంతో మంచి ప్రదర్శన ఇచ్చింది. ఐతే చిత్రమేమంటే బలమైన షాట్స్‌తో ఎంతో దూకుడైన బాటింగ్‌తో పాటు ఉపయుక్తమైన స్పిన్ బౌలింగ్ చేసే ఈ యంగ్ ఆల్‌రౌండర్‌ని గతేడాది విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో కనీస ధర ఐన రూ.10లక్షలకి కూడా ఏ ఫ్రాంచైజీ తీసుకోలేదు!

త్రిష తండ్రి ఒక జిం ట్రెయినర్. త్రిష కెరీర్ కోసం వారి కుటుంబం మొత్తం భద్రాచలం నుండి హైదరాబాద్‌కి షిఫ్ట్ అయ్యారు. త్రిష అనేక ఇంటర్వ్యూలలో తన తల్లిదండ్రుల గురించి గొప్పగా చెప్పుకున్నది. ముఖ్యంగా తన కోసం తండ్రిపడ్డ కష్టాల గురించి చెప్పింది. వరల్డ్ కప్‌లో త్రిష సెంచరీ చేసినప్పుడు ఆమె తండ్రి రాంరెడ్డి కూడా ప్రేక్షకుల్లో వుండి తన కుమార్తె ఘనతని స్వయంగా వీక్షించారు. తాను సాధించిన "ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ" అవార్డుని తన తండ్రికే అంకితమిచ్చింది. మహిళా క్రికెట్లో త్రిష సాధించిన ఘన విజయాల్ని చూస్తుంటే 6 సంవత్సరాల క్రితం వచ్చిన "కౌసల్య కృష్ణమూర్తి" సినిమా గుర్తొచ్చింది. కమర్షియల్ ఫార్మాట్లో వచ్చిన ఓ మంచి సినిమా అది. ఈ సినిమా విశిష్టత ఏమిటంటే కూతురు క్రికెట్ కెరీర్లో ఎదగడానికి అడ్డంకుల్ని అధిగమించడానికి శ్రమిస్తుంటే రైతైన తండ్రి వ్యవసాయంలో అంతకు రెట్టింపు కష్టాల్ని, అడ్డంకుల్ని ఎదుర్కొంటుంటాడు. ఇద్దరి వ్యధాభరిత జీవితాలు సమాంతరంగా సాగుతుంటాయి. చివరికి కూతురు భారత్‌కి ప్రాతినిధ్యం వహించి జట్టుని గెలుపు బాట పట్టిస్తుంది. ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అందుకుంటూ ఆమె క్రికెట్ గురించి మాట్లాడదు. దేశంలో వ్యవసాయం గురించి, దుర్బలమైపోతున్న రైతు గురించి మాట్లాడుతుంది. ఏ బ్యాంక్ అయితే టోర్నమెంట్‌ని వాణిజ్య దృక్పథంతో స్పాన్సర్ చేసి, ఆమెకి నగదు బహుమతిని అందిస్తుందో అదే బ్యాంక్ ఆమె తండ్రి ఇంటిని, ఇంట్లో సామానుని ఋణం కింద జప్తు చేస్తుంది. ఆ విషయం గురించి మాట్లాడుతుంది. "క్రికెట్లో జట్టుకి కష్టాలు వస్తే కోహ్లినో, టెండూల్కరో వచ్చి గట్టెక్కిస్తాడు. కానీ రైతు కష్టాల్లో వుంటే ఏ హీరో కూడా రైతుకి మద్దతుగా ముందుకొచ్చి కష్టాల నుండి బైట పడేయడు" అంటుంది. క్రికెట్లో విజయం సాధించినంత తేలిక కాదు వ్యవసాయంలో విజయం సాధించటమనే సందేశం ఈ సినిమా ఇస్తుంది ఈ సినిమాలో క్రీడారంగంలో ఆడపిల్లలు ఎదగటానికి ఎంత మానసిక వ్యధ భరించాలో ప్రభావవంతగా చూపాడు దర్శకుడు. ఒక కమిట్మెంట్‌తో తీసిన సినిమా ఇది. కౌసల్యగా ఐశ్వర్య రాజేష్, ఆమె తల్లిదండ్రులుగా రాజేంద్రప్రసాద్, ఝాన్సి తమ పాత్రలకి ప్రాణం పోసారు. ఎన్నో చోట్ల డైలాగ్స్ గుండెల్ని సూటిగా తాకుతాయి. సినిమా మొత్తం మంచి మూడ్ క్రియేట్ చేసిన బాక్ గ్రౌండ్ స్కోర్, ఫోటోగ్రఫీ గురించి కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇంత మంచి సినిమా రిలీజ్ ఐన వెంటనే మంచి పేరు తెచ్చుకోగానే ప్రభాస్ నటించిన "సాహొ" అనే పరమ చెత్త సినిమా కోసం థియేటర్లను వీడాల్సి వచ్చింది. ఇంతా చేసి ఆ "సాహో" అట్టర్ ఫ్లాప్. అందుకే అనేది "మన సినిమా హీరోలందరూ తెర మీదనే కాదు పరిశ్రమకే విలన్లు" అని!




## అందుకే నటనకు దూరమైంది!!

తెలుగులో ఎక్కువగా హీరో రాజేంద్రప్రసాద్‌తో గొడవ పడేదట. ఆయనతో ఇకపై తాను నటించనని అప్పట్లో తెగేసి చెప్పింది. కొంతకాలం తరువాత ఇక తాను సినిమాల్లోనే నటించనని తెగేసి చెప్పిందట. హీరో రాజేంద్రప్రసాద్ ధోరణులు శోభనకు నచ్చేవి కావని, ఆ హీరో వల్లే సినిమాలపైనే తనకు ఏవగింపు కలిగిందని, అందుకే ఆమె సినిమాలను వదిలేసిందని ఓ ఇంటర్వ్యూలో ప్రముఖ సినీ జర్నలిస్టు ఇముంది రామారావు చెప్పేరు.



# ప్రభాస్.. ప్రళయకాల రుద్రుడు

కన్నప్ప సినిమా గురించి గత కొద్ది రోజులుగా మంచి హైప్ క్రియేట్ అవుతోంది. మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్, అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. ఈ సినిమాలో టాలీవుడ్, బాలీవుడ్, మలయాళం, తమిళ ఇండస్ట్రీలకు చెందిన అగ్ర నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రాచీన భారతీయ కన్నప్ప కథాంశం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్ కూడా సినీ ప్రేమికుల్లో భారీ ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ఇతర పోస్టర్స్ ప్రేక్షకులను ఆకట్టుకోగా, తాజాగా మరో కీలక అప్డేట్ వచ్చింది. ఈ సినిమా భారీ తారాగణంతో రూపొందుతోంది. మంచు విష్ణు టైటిల్ రోల్‌లో కనిపించనుండగా, బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్, మలయాళ మెగాస్టార్ మోహన్ లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్, మధు, అర్పిత రాంకా, సంపత్ రాజ్, దేవరాజ్, బ్రహ్మానందం, సప్తగిరి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మోహన్ బాబు నిర్మాతగా వ్యవహరిస్తుండగా, ముకేష్ కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్ మరియు టెక్నికల్ స్టాండర్డ్స్ ని అమలు చేస్తున్నారు. ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే అప్డేట్ వచ్చింది. రెబల్ స్టార్ ప్రభాస్ ఈ సినిమాలో రుద్ర అవతారంలో కనిపించనున్నాడు. ఈరోజు విడుదలైన కొత్త పోస్టర్‌లో ప్రభాస్ అత్యంత పవర్‌ఫుల్ లుక్‌లో దర్శనమిచ్చాడు.

త్రిశూలం చేతబట్టి, గంభీరమైన శివతాండవం భంగిమలో కనిపిస్తున్న ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "ప్రళయ కాల రుద్రుడు! త్రికాల మార్గదర్శకుడు !! శివాజ్ఞ పరిపాలకుడు !!!" అనే క్యాప్షన్ పోస్టర్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభాస్ ఈ సినిమాలో నందీశ్వరుడి పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన లుక్ చూసిన వెంటనే ఆడియెన్స్‌లో భారీ హైప్ క్రియేట్ అయింది. గతంలో టాలీవుడ్‌లో ఇలాంటి పవర్‌ఫుల్ పాత్రలు చాలా తక్కువగా తెరకెక్కాయి. అయితే కన్నప్ప సినిమాలో ప్రభాస్ లుక్ చూసిన తర్వాత ఈ సినిమా మంచి హైప్ కలిగి ఉండేలా ఉంది. టీజర్, ఇతర అప్‌డేట్స్ తోనే సినిమాపై అంచనాలు పెరిగిన నేపథ్యంలో, ఈ రుద్ర లుక్ పోస్టర్ మరోసారి సినిమాకు పబ్లిసిటీని పెంచింది. కన్నప్ప సినిమా ఏప్రిల్ 25, 2025న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రాచీన భారతీయ సంస్కృతిని, భక్తి, యుద్ధ శౌర్యాన్ని కలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్‌ను ప్రతీ సోమవారం విడుదల చేస్తూ వస్తున్నారు. కన్నప్ప కథలో ఉన్న మైథలాజికల్ ఎలిమెంట్స్, ప్రభాస్ వంటి స్టార్ హీరోల పాత్రలు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఉన్నాయి. ప్రస్తుతం బెంగుళూరు, చెన్నైలో షూటింగ్ కార్యక్రమాలు చివరి దశకు చేరుకోగా, త్వరలో సినిమా మిగతా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుకానున్నాయి. ఈ ప్రాజెక్ట్ తెలుగు ఇండస్ట్రీలో అత్యంత హైప్ క్రియేట్ చేస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలుస్తోంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...




## ఫ్యాన్స్ డిజిటల్ వార్

నేచురల్ స్టార్ నాని నిర్మాణంలో గతంలో వచ్చిన హిట్, హిట్-2లు సూపర్ హిట్స్‌గా నిలిచాయి. ఇప్పుడు ఈ సూపర్ హిట్ ఫ్రాంచైజీకి సీక్వెల్‌గా హిట్-3 ని నిర్మిస్తున్నాడు నాని. ఈ సారి నాని స్వయంగా నటిస్తూ నిర్మిస్తున్నారు. రూత్‌లెస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నాడు నాని. అయితే ఈనెల 26న రిపబ్లిక్ కానుకగా ఈ సినిమా నుండి నాని పోస్టర్‌ను రిలీజ్ చేయగ ఊహించని విధంగా నానిపై పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరుగుతోంది. హిట్-3 నుండి రిపబ్లిక్‌డే విషెష్ తెలుపుతూ మెరిసిన గడ్డంతో కాప్ డ్రెస్సులో గన్‌తో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తూ పాకెట్‌లో చేయి పెట్టుకుని మాస్ లుక్‌లో రిలీజ్ చేసిన పోస్టర్ వివాదానికి దారి తీసింది. గన్‌తో జాతీయ జెండాకు వందనం చేయడం ఏంటని ఓ స్టార్ హీరో ఫ్యాన్స్ ట్వీట్ చేయడంతో వివాదం మొదలైంది. అందుకు బదులుగా ఆ సదరు స్టార్ హీరోని సింగిల్ ఎక్స్ప్రెషన్ హీరో అని కామెంట్స్ చేయడంతో వివాదం మరింత ముదిరింది. దీంతో స్టార్ హీరో ఫ్యాన్స్ నానిపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రోజురోజుకి సోషల్ మీడియాలో నెగిటివిటి హద్దులు దాటి సినిమాను చంపుకునేంత వరకు వెళ్తుంది. ఇటీవల వచ్చిన గేమ్ ఛేంజర్ అందుకు ఉదాహరణ. ఒకవైపు సదరు హీరోలు 'మేము మేము బాగానే ఉంటాం, మీరు బాగవ్వాలి' అని చెప్తున్న కూడా హద్దులు దాటిన ఆవేశంతో ఫ్యాన్స్ డిజిటల్ వార్‌కి తెరలేపుతున్నారు.






# 15న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా సాగిన గ్రంథాలయ ఉద్యమం మరోసారి అవసరమైందని మేధావి వర్గం అభిప్రాయపడుతోంది. దీనికోసం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం పేరుతో రాష్ట్ర స్థాయిలో ఒక కార్యాచరణ ప్రణాళికను జనవరి 9న విజయవాడలో జరిగిన ఒక ప్రాథమిక సదస్సు ఖరారు చేసింది. ఈ నెల 15న శ్రీకాకుళం నుంచి ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని తీర్మానించింది. ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్‌తో పాటు ప్రముఖ రచయితలు, కవులు, ప్రచురణకర్తలు ఈ కార్యక్రమానికి హాజరవుతారని అభ్యుదయ రచయితల సంఘం శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఏళ్లుగా స్థానిక సంస్థలు, పరిశ్రమలకు గ్రంథాలయ సెస్ పేరుతో చెల్లిస్తున్న డబ్బును రాష్ట్ర ప్రభుత్వాలు పక్కదారే పట్టిస్తున్నాయని, గ్రంథాలయ వ్యవస్థ దాదాపు నిర్వీర్యమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు జిల్లా గ్రంథాలయ సంస్థలు రచయితలను ప్రోత్సహించేవని, గ్రంథాలను కొనుగోలు చేసేవని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని వారు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతి జిల్లా గ్రంథాలయ సంస్థకు ఉన్న బకాయిలు కోట్ల రూపాయల్లోనే కనిపిస్తున్నాయని తెలిపారు. గ్రంథాలయాల సెస్‌ను గ్రంథాలయ సంస్థల అభివృద్ధికే వినియోగించాలని, కొత్త పుస్తకాల కొనుగోలు, ముద్రణను ప్రోత్సహించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగాలను భర్తీ చేయాలని కూడా కోరారు. శాఖ గ్రంథాలయాల మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించాలన్నారు. శ్రీకాకుళం నుంచి ప్రారంభమవుతున్న ఈ పునర్వికాస ఉద్యమానికి గ్రంథాలయాల పాఠకులు, సాహితీ సంస్థలు, మేధావి వర్గం ప్రతినిధులు అండదండలు ఇవ్వాలని, 15న ఉదయం 10 గంటలకు జిల్లా గ్రంథాలయ సంస్థ దగ్గర జరిగే ప్రారంభ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.






# విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

❖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ సతీష్ మాకేన

❖ పద్మావతి డిగ్రీ కళాశాలలో వైభవంగా 'ఉత్సవ్'




(సత్యంన్యూస్, నరసన్నపేట)

విద్యార్థులకు నైపుణ్యతతోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ సతీష్ మాకేన అన్నారు. సోమవారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల 'ఉత్సవ్' పేరిట నిర్వహించిన వార్షికోత్సవం సందడిగా సాగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలు సాధించడంలో యువత వెనుకబడి ఉందని, డిగ్రీతో పాటు పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. సాంకేతికంగా ప్రపంచం మారుతోందని, రేపటి రోజుల్లో విప్లవాత్మకమైన మార్పులు రాబోతున్నాయన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం యువత పాటుపడాలని కోరారు. కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులు గమనించి ఆధునిక ప్రపంచానికి అవసరమైన కోర్సులు పూర్తి చేయాలని కోరారు. ఏ డిగ్రీ చదువుతున్నప్పటికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి కోర్సులు ఆన్‌లైన్‌లో చదివి వాటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, యూట్యూబ్ సింగర్ లావేటి మహేష్, అధ్యాపక, విద్యార్థుల బృందం పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకగా సాగాయి.







## 4న సాందీపనిలో రథసప్తమి వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హిందూ ధర్మ ప్రచార పరిషత్ తిరుమల తిరుపతి దేవస్థానాలు, శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4న ఉదయం తొమ్మిది గంటలకు శ్రీసాందీపని విద్యాలయంలో విద్యార్థులందరితో సూర్య నమస్కారాలు, ఆదిత్య హృదయ పారాయణం, యోగాభ్యాసములు నిర్వహిస్తున్నట్టు హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఎం.లలితమణి ఒక ప్రకటనలో తెలిపారు. రథసప్తమి విశిష్టతపై ధార్మిక ఉపన్యాస కార్యక్రమం, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. వెయ్యి మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు లలితమణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రథసప్తమిలో హెలికాప్టర్ సందడి

**ప్రజల డిమాండ్ మేరకు 5వ తేది వరకు పొడిగింపు**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వ పండగగా నిర్వహించిన మొదటి సంవత్సరం జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు భక్తులు, పర్యాటకుల మనస్సును హత్తుకున్నాయి. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా చేసిన ఏర్పాట్లపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రేపటితో ముగియనున్న హెలికాప్టర్ రైడ్ ప్రజల డిమాండ్ మేరకు ఈ నెల 5వ తేది వరకు పొడిగిస్తున్నట్లు డ్వామా పీడీ బి. సుధాకర్ తెలిపారు. తొలిరోజైన ఆదివారం ఉదయం 80 అడుగుల రోడ్డులో సూర్యనమస్కారాలు, ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో గ్రామీణ క్రీడలు, సాయంత్రం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో పదిలమయ్యాయి. అయితే, ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది హెలికాప్టర్ రైడ్. భక్తులు హెలికాప్టర్‌లో ఎక్కి ఆలయ పరిసరాలను విహరించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఈ హెలికాప్టర్ రైడ్ చాలామందికి కొత్త అనుభూతిని అందించింది. తొలిరోజు బుకింగ్స్ ఊహించ లేకపోయారు. ఒకేసారి వేలాది మంది వెబ్‌సైట్ సందర్శించడంతో టికెట్స్ బుక్ చేసేయడంతో వెబ్ సైట్ సర్వర్‌పై ఒత్తిడి పడింది. మొత్తానికి ఒక ట్రిప్పులో ఆరుగురు చొప్పున 8 నిమిషాల పాటు విహరించడం నగరవాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇక మధ్యాహ్నం గంటలకు కాలేజీ రోడ్డు నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కూడా ప్రత్యేక ఆకర్షణగా ప్రజల హృదయాల్లో నిలిచింది.

# భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

❖ జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రథసప్తమి వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రథసప్తమి సందర్భంగా సోమవారం రాత్రి నుంచి అరసవిల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. భక్తుల దర్శనానికి, వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రతిఒక్కరు నిబద్ధతతో పనిచేసి రథసప్తమి వేడుక ప్రశాంతంగా జరిగేటట్లు విధులు నిర్వహించాలని సూచించారు. అరసవల్లిలో రథసప్తమి వేడుకలకు బందోబస్తు విధులు నిర్వహించడానికి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ సోమవారం పలు అంశాలపై దిశానిర్దేశాలు చేశారు. ఎంతో భక్తిశ్రద్ధలతో దర్శనానికి రానున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు బస్సులు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని, నిర్దేశించిన స్థలాల్లో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయించాలన్నారు. దాతలు, టికెట్ల మేరకు ప్రత్యేక దర్శన మార్గాలు ఏర్పాటు చేశారని తెలిపారు. భక్తులకు, విధులు నిర్వహించటానికి వచ్చిన సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం లేకుండా వైద్య శిబిరాలు, మంచినీళ్లు ఏర్పాటుచేసి అవసరాననికి తగ్గట్టుగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. మొత్తం బందోబస్తుని 20 సెక్టార్లుగా విభజించి ముగ్గురు అదనపు ఎస్పీలు పర్యవేక్షణలో, డీఎస్పీలతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది మొత్తంగా సుమారు 2,300 మంది సిబ్బందితో బందోబస్తును విభజించామన్నారు. సమయస్ఫూర్తితో పోలీసు అధికారులు సిబ్బంది వ్యవహరించి భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు అందుబాటులోను ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సిబ్బంది భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి తోపులాట్లు, అవాంతరాలు జరగకుండా అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం కలెక్టరు స్వప్నల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆలయ ప్రాంగణంలో సందర్శించి దర్శన మార్గాలు, క్యూలైన్లు ప్రదేశాలను పరిశీలించారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం అదనపు ఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, అనకాపల్లి అదనపు ఎస్పీ దేవప్రసాద్, పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన, డీఎస్పీలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నాటకరంగాన్ని బతికించండి

❖ సీనియర్ నటి కేశిరెడ్డి రాజ్యలక్ష్మి

❖ ఉభయ రాష్ట్రాలకు నాటక పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



నాటక రంగానికి ప్రాణంపోసి బతికించాలని శ్రీ ముత్యాలమ్మ కళానికేతన్ వ్యవస్థాపకులు కేశిరెడ్డి రాజేశ్వరి సోమవారం అన్నారు. పీఎన్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో శ్రీ ముత్యాలమ్మ కళానికేతన్ వ్యవస్థాపకురాలు కేశిరెడ్డి రాజేశ్వరి మాట్లాడుతూ నాటక రంగానికి పూర్వవైభవం తేవాలని, నాటక రంగంపై మక్కువతో చాలామంది నటీనటులు ఇప్పటికీ వీటి మీద ఆధారపడుతున్నారని గుర్తుచేశారు. ఇందులో భాగంగా శ్రీ ముత్యాలమ్మ కళానికేతన్, పీకే ఎంటర్‌టైన్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని, స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 9,10,11 తేదీలలో సాయంత్రం 6 గంటల నుంచి జరగుతాయని, కేశిరెడ్డి రాజేశ్వరితో పాటు, పీకే ఎంటర్‌టైన్మెంట్ నిర్వాహకులు ప్రసాద్, కుమారి ప్రజలందరికీ ఆహ్వానం పలికారు. అందరూ ఈ మూడు రోజుల కార్యక్రమానికి విచ్చేసి నాటికలను వీక్షించి, మన సంస్కృతిని కాపాడుకోవాలని చెప్పారు. అలాగే కార్యక్రమ నిర్వహణకు ప్రముఖులు అండగా నిలిచారని, ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ ముత్యాలమ్మ కళానికేతన్ వ్యవస్థాపకులు కేశిరెడ్డి రాజేశ్వరి, శ్యామ్‌కుమార్, పీకే ఎంటర్‌టైన్మెంట్ నిర్వాహకులు ప్రసాద్, కుమారి, సభ్యులు రొక్కం భాస్కర్, కీర్తి, అభిరామ్, గోవింద(ఆర్టిఎఫ్), పూర్విశ్రీ, విశ్వచైతన్య నల్లి రమణ, శ్రీనివాస్, రాజశేఖర్, లక్ష్మీ నారాయణ, విశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యమా.. ఉలికిపడు!

(మొదటిపేజీ తరువాయి)

**"టౌన్‌లో ఆదరాబాదరాగా పనులు చేస్తుంటే ఇప్పుడెందుకొచ్చిన గోల అనుకున్నాను. రథసప్తమికి రోడ్లు ముస్తాబు కాకపోతే వచ్చిన నష్టమేమిటని భావించాను. కానీ ఇప్పుడు కళింగ రోడ్డు, పాలకొండ రోడ్డు స్వరూపమే మారిపోయింది. డివైడర్లు పెట్టి రోడ్డు టైట్ చేసేస్తారేమోనని భయపడ్డాను. కానీ కళింగ రోడ్డు చాలా అందంగా మారింది. దీనికి తోడు లైటింగ్ కొత్త శోభను తెచ్చిపెట్టింది."**

**- పసగాడ రామకృష్ణ, మాజీ కౌన్సిలర్**

ఊరంతా ఒకటే సందడి.. దేశంలో ఏ మూల ఉన్నా సంక్రాంతికి సొంతూరుకు చేరుకునే పెదపండుగలా మారిపోయింది రథసప్తమి. అరసవల్లి సూర్యనారాయణ స్వామి జన్మదినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యమంత్రిని కోరినప్పుడు రథసప్తమి ఏంటి? రాష్ట్రపండగేంటి? అని నవ్వారు. రాష్ట్ర ప్రభుత్వం పండుగగా గుర్తించినంతమాత్రాన ఉత్సవాలైపోతాయా? అని పెదవి విరిచారు. కానీ రథసప్తమి అనే కాన్సెప్ట్‌ను ముందుపెట్టి నగరాన్ని ఎలా సుందరీకరించొచ్చో ఎమ్మెల్యే గొండు శంకర్, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు చూపించారు. ఇంతవరకు కళింగ రోడ్డు ఒకటుందంటూ ఎవరూ పెద్దగా గుర్తించలేదు. అటువంటి చోట సెంటర్ లైటింగ్ పెట్టి పసగాడ నారాయణ మిల్లు జంక్షన్ రూపురేఖలే మార్చేశారు. పనిలో పనిగా పాలకొండ రోడ్డులో కోనోకార్పస్ చెట్లు తొలగించి సెంటర్ లైటింగ్ ఎప్పటిలాగే ఏర్పాటుచేసి సుందరీకరణలో భాగంగా కొత్త మొక్కలు నాటారు. ఒక్క రథసప్తమి పుణ్యమాని పాలకొండ రోడ్డు, కళింగ రోడ్డు మెరుగయ్యాయి. పక్కనున్న విజయనగరంలో ఎక్కడ పడితే అక్కడ చెరువుల చుట్టూ సుందరీకరించిన బోర్డులు కనిపిస్తుండగా, శ్రీకాకుళంలో మాత్రం అటువంటి హంగులు ఎక్కడా ఉండేవికావు. ఇప్పుడు మూడు రోజుల రథసప్తమి ఉత్సవాల పుణ్యమాని కొత్త శోభ సంతరించుకుంది. ఆదివారం నగరంలో జరిగిన శోభాయాత్రను చూసిన ప్రజలు అయ్యారే.. అని ముక్కున వేలేసుకున్నారు. మన సంస్కృతిని ప్రతిబింబించే శకటాలు, కోలాటాలు, తప్పెటగుళ్లు, కర్రసాము చేస్తూ నగర రోడ్ల వెంబడి మంత్రి, ఎమ్మెల్యే నడుస్తుంటే జనం సంతోషంతో అభివాదం చేస్తున్న సన్నివేశాలే ఈ కార్యక్రమం విజయవంతమైందని చెప్పడానికి సంకేతం. ఆదివారం ఉదయం నుంచి సిక్కోలు గగన తలంపై హెలికాప్టర్ చక్కర్లు, రోడ్లన్నీ వెలుగు జిలుగులతో కొత్త అందాన్ని తీసుకొచ్చాయి. అన్నింటికంటే ముఖ్యంగా సమాజంలో అన్ని వర్గాలవారిని ఇందులో ఇన్‌వాల్వ్ చేయడం గొప్ప విషయం. క్రీడలు, చిత్రలేఖనం, నృత్యం, సంగీతం.. ఇలా అన్ని రంగాల నుంచి ప్రదర్శనలు జరగడం, దానికి విశేష ఆదరణ లభించడం కొసమెరుపు. అలాగే అన్ని వర్గాల నుంచి రథసప్తమికి సహాయం తీసుకోవడం కూడా విశేషమే. రథసప్తమి అనగానే నీళ్లో, పాలో పోయడానికి ఎప్పుడూ కొందరు ముందుకొస్తుంటారు. కానీ ఈసారి అటువంటివారితో పాటు దూరంగా ఉన్నవారిని సైతం గుర్తించి వినియోగించుకోవడం రథసప్తమి వేడుకలకు సేవ చేసేవారి సంఖ్య పెరిగింది. అయితే ఇప్పటి వరకు జరిగిన ప్రతీ కార్యక్రమం సూపర్ హిట్టే. సరిగ్గా సోమవారం అర్థరాత్రి నుంచే అసలు హీటు మొదలవుతుంది. క్షీరాభిషేకానికి, నిజరూప దర్శనానికి జనాలు ఎగబడకుండా, తోపులాట లేకుండా సావదానంగా దర్శనం జరిగితేనే రథసప్తమి ఉత్సవాలు విజయవంతమైనట్టు. గతం మాదిరిగా కాకుండా ఈసారి వాహనాల పార్కింగ్ కోసం ఆలయానికి దగ్గరలోనే స్థలాన్ని కేటాయించడం మొదటి విజయం. గతంలో పాతబస్టాండు వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు బొమ్మ దగ్గరే నిలిపేసేవారు. ఆ తర్వాత 80 అడుగుల రోడ్డులో వీఐపీల వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చేవారు. ఈసారి వారు, వీరు అన్న భేదం లేకుండా అరసవల్లిలో ఉన్న గుండవారి కల్యాణ మండపం వరకు వాహనాలు వెళ్లే ఏర్పాట్లు చేశారు. వీఐపీ పాస్‌లు లేవని, డోనార్ పాస్‌లు కూడా ఇష్టారాజ్యంగా ఇవ్వడంలేదని ప్రకటించిన తర్వాత చాలామంది విమర్శిస్తున్నారు. గతంలో డోనార్‌ల పేరుతో ఆలయంలో ఉన్న అర్చక ముఠా చాలా మందికి పాస్‌లు ఇచ్చేసేవారు. దీనివల్ల అసలు ఆలయానికి, స్వామివారికి డబ్బులిచ్చినవారు వెనక్కు తగ్గాల్సిన పరిస్థితి ఉండేది. అరసవల్లి ఆలయంలో అసలు ఒరిజినల్ డోనార్లు ఎంతమందో లెక్కాపత్రం లేదు. అందుకే ఈసారి నేరుగా దాతలనే రమ్మన్నారు. దీంతో ఇప్పటి వరకు రథసప్తమి వేడుకకు దాతల పేరుతో గతంలో హల్‌చల్ చేసినవారు సగానికి పైగా తగ్గుతారని భోగట్టా. అరసవల్లి పాలక మండలి సభ్యులు, అరసవల్లి లోకల్ కోటా కింద ఆలయం కిక్కిరిసిపోయేది. ఈసారి అటువంటివి ఏమేరకు నిరోధిస్తున్నారో మంగళవారం నాటికి తెలుస్తుంది. కానీ రథసప్తమి అనగానే శ్రీకాకుళం నగరం, అరసవల్లి ఆలయం, భక్తుల క్యూలైన్లు పోలీసుల కంట్రోల్ లోకి వెళ్లిపోతాయి. వీరు భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం వల్ల ప్రతీ రథసప్తమికి పెదవివిరుపు మాటలే వినిపించేవి. అలాగే క్యూలైన్‌లో కాకుండా తమ కుటుంబ సభ్యులను, వందిమాగదులను దర్శనానికి తీసుకువెళ్లడం పోలీసులకు ఆనవాయితీ. దీనివల్ల సాధారణ భక్తులు గగ్గోలు పెట్టేవారు. ఈసారి ఇటువంటి ఓవరాక్షన్లు లేకుండా స్థానిక సన్‌రైజ్ హోటల్‌లో మంత్రి, ఎమ్మెల్యే లైవ్ కవరేజీని, సీసీ టీవీల ఫుటేజ్‌ని పర్యవేక్షిస్తారని తెలుస్తుంది. ఎస్పీ కూడా స్ట్రిక్ట్ కావడంతో ఈసారి పోలీసులు సొంత లాభం కొంత మానుకుంటారని భావించాల్సి ఉంది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.